కథానిక

# పోయిన మనశ్శాంతి

"శ్రీవిరించి"

ప్రతిమానవుడికి తన నూరేళ్ళ జీవితంలోనూ తారస్థాయి నందుకొన్న అదుర్దా సంఘటిత మయే పరిస్థితి యేదో ఒక క్షణంలో కలగక మానదు. ఇదేవిధంగా ఆనందమూ సుఖమూ కోపమూ వైరాగ్యమూ మొదలైన పరమ గుణా లన్నీ కూడాను. పూర్తి జీవితంలోను మనిషి ఒకడుగానే నించుంటాడు కాని చుటూవుండే పరిస్థితులు క్షణక్షణానికీ రంగు మారిపోతాయి. వాటి ప్రభావం నిమిషనిమిషానికీ ఒక వేపుగా చొచ్చుకపోయి ప్రతిఫలిస్తుంది. ప్రవర్తన దీన్నను సరించి మారక తప్పదు.

కనక, సీతారామయ్యకు అకస్మాత్తుగా కలిగిన మానసికవేదనకు మనం అతన్ని తప్పుపట్టి ప్రయోజనం లేదు. పోతే దానికి కారణం యెవరో యేమిటో కేవలం శీతారామయ్యకే తెలీదు.

శీతారామయ్య తాలూకు గతచరిత్రను స్మరిస్తే మన కతన్నిగురించి తెలియగల కొన్ని లక్షణాలు పరామర్శించుకొందాం. అతను గుండె నిబ్బరం కలవాడు, జీవితంలో రాగల ఆటుపోటులకు అంత తేలిగ్గా బెదిరేరకం కాదు, ప్రియురాలు, ప్రేమ, త్యాగాలూ, యిత్యాది పదజాలపు ఆధ్యాత్మిక చింతనలో అతనెప్పుడూ వొళ్లుమరిచి పని చెయ్యలేదు. ఇలాంటి మనోహరమైన గత చరిత్ర కలవాడు. అకస్మాత్తుగా ఒక్కక్షణంలో మనోవైకల్యంచేత పట్టుతప్పి పరితపించాడు.

ఏమీలేదు క్రితం రాత్రి యేదో సినిమాకి వెళ్ళి రెండుగంటలవేళ యింటికివచ్చి పేరుకు పడుకున్నాడన్నమాటేగాని నిద్రపట్టిందీ లేదు. బడలిక తగ్గిందీలేదు. సినిమాయే యింకా కళ్ళముందు తెరుచుకొన్నా మూసుకొన్నాకూడా రీళ్లు రీళ్లుగా తిరుగుతోంది. పూర్వం అనేకం చూశాడు సినిమాలు కాని యేవొకటీ తననింత అపూర్వంగా కదిలించి వేసినాయి కావు. ఇదయినా తనంతట తాను కోరుకున్నది కాదుగదా, కేవలం కాకతాళీయం.

సినిమాలో తనుచూచిన వైనం యేమంత గొప్పదీ సుప్రసిద్ధమైనదీకూడా కాదు: ఒక కుటుంబ యజమాని స్వస్థలమయిన పల్లెటూరు వెడితే "పెట్టీ బూర్జువా" అవుతాడు, బస్తీకివస్తే "మధ్య తరగతి ప్రజానీకం"లో జమ అవుతాడు—అతను రెక్కల కష్టంమీద నిజదారసుతోదరపోషణ నెరపుకుంటున్నాడు. కాని దురదృష్టచక్రపు టిరుసులపడి ఆ కుటుంబం నలిగిపోయింది. మాయదారి కలరాచేత యేనుగంతటి మనిషీ కాలగర్భంలో లీనమైనాడు. ఇక అతని భార్య, కొడుకుల అవస్థలు పొట్టకూటికోసం పడే యమయాతన బ్రహ్మాండమైన విషాదావస్థలో కనిపింప చేస్తూ సినిమా అంతం అయింది.

శీతారామయ్య ఆలోచన అపారంగా సాగిపోతోంది. ఏమిటీకథ? ఎక్కడకి దారి?

ఆ కథానాయకుడికన్నా తనుయేం గొప్పవాడు? ఒకవేళ విధి కన్నుకుట్టి తను తనువు చాలించటం తటస్తిస్తే ఇంకేమైనా వుందా? భార్యాబిడ్డలు? అబ్బబ్బ! సినిమాలో చూచిన ఘోరదృశ్యాలు యింకా యెన్నో ఊహాతీతమైన ఘటనలు మెదడులో దొర్లిపోతున్నాయి. తన ఆలోచనల్లో యేదీ తప్పుకాదు. ఒకటీ అసాధ్యమయిందిలేదు.

తనకు జీవితంలో "నాకేమీలోటులేదు" అని మారాయించి కూచోగల ధీమా ఎక్కడుంది? తన తదనంతరం కుటుంబంకోసమని తనేమి జాగ్రత్త చెయ్యగలుగుతున్నాడు? అసలామాటకువస్తే—యేం జాగ్రత్త చెయ్యగలడు తను? వచ్చే యెనభై రూపాయిల నెలసరి ఆదాయంలోనూ రోజువారీ కోరికలే తీరటం బహుకష్టంగా వుందికదా, యిక తను బ్యాంకులో యేందాచుకుంటాడు, యెన్ని పాలసీలు యిన్సూరు చేయగలడు? ఇవన్నీ కాని పనులు.

పోతే జరిగేది జరగక మానుతుంది కనుకనా నాకెందుకీ విచారం అని కాలుమీద కాలేసుకు

కూర్చుందామంటే చేతకాకుండాపోతోంది. "నీకేమీ విచారమేలేదా? నీ భార్యాపిల్లలు బజారులో జోలెకట్టుకుని వచ్చేపోయే అలగాజనాన్ని సైతం బాబూ కానీ ధర్మం చేయండి- అని అడుక్కోటం, ప్రతివాడూ వాళ్ళని తేలిగ్గా చూసి ముఖాన ఉమ్మేయటం యెట్లా భరించగలవు? ఆ మాత్రం ఆత్మాభిమానం నీకుండనవసరంలేదా?' అని ఒకప్రక్క అంతరాత్మ ఒక్కపెట్టున ఘోషిస్తూంది. కాని తనేం చెయ్యగలడు?

ఎనభైరూపాయిలుతప్ప రాగిదమ్మిడీ తనకు రాగల సాధనం యేమీలేదు. కాని మనస్సు మాత్రం పీకుతూనేవుంది. యేమిటేమిటని ఒకే తొందరచేస్తోంది. కళ్లు తెరుచుకుని తనవాళ్ళను నింపాదిగా చూడలేకపోతున్నాడు, ఒకటే భయం. అన్యాయం చేస్తున్నాడు తను తన సంతతికి. మార్గాంతరం కనిపించదు. ఏమిటి చేసేట్టు?

"ఏమండీ చెప్పండి. ఏమిటి యేదో అదో మాదిరిగా తయారవుతున్నారు ఈమధ్య? ఏమిటి మీ మనస్సుని పాడుచేస్తున్న బెంగ? నాతో చెప్పరూ?" అనడుగుతూంది అర్ధాంగి సత్యవతి. ఒకసారికాదు, ఈసారికప్పుడే నాలుగైదుసార్లు, అడక్కుండా వుండలేకపోయింది. కాని ప్రతిసారీ తను ఏమని సమాధానం చెబుతున్నాడు? అంతకన్నా యేం చెప్పగలడు? చెప్పగల మనోధైర్యం తనకున్నదీ?

"నాదగ్గర దాస్తున్నారు. పోనీలెండి. మీకంత యిష్టం లేకపోతే నాబలవంతంయేమీలేదు. అనవసరంగా దిగులు యెందుకండీ?" అంటూంది లాలనగా సత్యవతి.

పాపం, యీ ముద్దరాలికి తన ఆంతరంగిక పుటాలోచనలు వేదన యేమీ తెలీవుగదా అని విచారపడుతున్నాడు తను. ఒకవేళ యే పరిస్థితిలోనన్నా తెలిసినా ఎంత ఖేదపడుతుందోగదా, పాపం. నన్ను చేసుకోబట్టిగదా యీ కష్టాలన్నీ దీనికి? నాకర్మ వీళ్ళకి కూడా చుట్టుకుంటూంది! సీతారామయ్య విచారం ఇంతా అంతా కాదు. భార్యతో కూలాసాగా మాట్లాడలేకపోతున్నాడు. కుర్రాళ్ళని బుజ్జగించి మనస్ఫూర్తిగా లాలించలేకపోతున్నాడు. ఇల్లు తలుచుకుంటేనే యేదో నరకం దాపవుతున్నట్టు ఫీలవుతున్నాడు. ఆఫీసులో వుంటున్న కొన్నిగంటలయినా మనస్సు లీనంచేసి పనిచెయ్యలేకపోతున్నాడు. లోగడ ఆఫీసరుగారి మన్ననకు పాత్రుడయి వుండటంచేత సీతారామయ్యలోని యీ పస్తాయింపు గణనకు త్వరలో వచ్చిందికాదు.

రోజులు గడుస్తున్నకొద్దీ సీతారామయ్య బేలతనం మరీ పెరిగిపోతోంది. ఎవడికైనా కష్టాలు ఒక్కుమ్మడిగా వచ్చినప్పుడు యేదేనా అన్యాయము జరుగుతున్నప్పుడు దాన్ని వాడు కడుపులో పెట్టుకొని ఎంతోకాలం యీడవలేడు. ఎవడికో మరొకడికి తన సోది వెళ్ళబోసుకొంటే కాని మనస్సు తేలికపడదు. సీతారామయ్య ఇన్నిరోజులూ ఎంతో గుంభనగా వుండగలిగినాడు. కాని యిక నాపని సాధ్యం అనిపించటంలేదు. అయితే ఎవరికి చెప్పుకుంటాడు? ఎవరు వింటారు తన ధోరణి? ఎవడికథతో వాడికి తల ముక్కలైపోతూన్న ఈ నికృష్టపురోజుల్లో సీతారామయ్య గాథ వినేందుకు ఎవరు ముందుకువస్తారు?

చాలాసేపటికి తోచింది సీతారామయ్యకు—తన జీవితంలో పాలుపంచుకొన్న అర్థాంగివుండగా మరొకరు యెందుకని. కాని, పాపం సత్యవతికి యీ దురవస్థ అంతా యెట్లాచెప్పగలడు తను? తను యిన్నాళ్ళూ యెలాగూ దుఃఖపడి కుమిలిపోతూనేవున్నాడు. యిక సత్యవతికూడానా? ఆమె దుఃఖపడుతూంటే యెట్లా భరించగలడు తను? కాని, యేం చేసేట్టు?

ఈ బాధ సీతారామయ్య ఒక్కడితోనే పోలేదు. ఇన్నాళ్ళనించిన్నీ సత్యవతికూడా భర్త బెంగకు కారణంయేమిటోనని తెగఆలోచించింది. కాని ఆమెకు సమాధానంగా ఏమీ దొరకలేదు. ఒకవేళ తనలో యేదేనా మార్పువచ్చి ఆయనకు ఖేదకారణంకాలేదుకద! తనకు తెలిసినంతవరకూ తనలో యేమీ మార్పురాలేదు. ఎంతోసేపు ఆలోచించినమీదటకాని తన భర్తమార్పుకు తానేమీ కారణంకాదని ఆమె తేల్చుకోలేకపోయింది. కాగా తను తోడువుండి చేస్తున్న సహాయం యేమిటి? ఎట్లాగయినాసరే. యీ నాడు ఖేదకారణం తెల్చుకుని ఊరడిల్లజేస్తేగాని లాభంలేదని తీర్మానించుకొన్నది.

సరిగ్గా ఆ నాడే సీతారామయ్య కూడా భార్యతో తను మనసువిప్పి మాట్లాడాలని నిశ్చ

యించుకొన్నాడు. కనక సత్యవతికి భర్తచేత చెప్పించటంలో ఎక్కువశ్రమ తప్పిపోయింది.

వెన్నెలరాత్రి డాబామీద మంచంమీదపడుకుని సీతారామయ్య చెబుతున్నాడు. రెండో మంచంమీద కూర్చుని సత్యవతి వింటున్నది.

తను చెప్పాల్సిందంతా అరగంటలో ముగించి సీతారామయ్య అన్నాడు. "ఏ క్షణానికి యేం జరిగినా జరగొచ్చుకద? నాకు యెక్కువకాలం బతుకుతాననే ఆశలేదు. చావుబతుకులు మన చేతిలోలేవుకదా? ఇంకేంచెప్పను? నువ్వు పిల్లల్తో సహా అష్టకష్టాలుపడుతూంటే నేనెట్లా భరించను సత్యవతీ?"

సీతారామయ్య నిజంగా యేడుస్తున్నాడు. ఇన్నియేళ్ళజీవితంలోనూ విరక్తికలిగి దాన్ని బయటికిచెప్పగలిగి హృదయం చించుకుపోయేట్ట ఏడవగలగటం యిదే మొదటిసారి! సత్యవతికికూడా యేడుపు ముంచుకొచ్చింది భర్త విషాదస్థితి చూసేసరికి. కాని-కాని అతనెందుకు యింతగా బాధపడాలో యేమిక్కూ దివాళంమూ లేనివాళ్ళలాగ వాపోవాలో సత్యవతికి కారణం దొరకలేదు.

వెక్కివొక్కివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ సత్యవతి అడిగింది. "నిజంచెప్పండీ, యిదేనా మీ విచారానికంతకీ మూలం?"

భార్య ఇంత అనుమానిస్తుందని సీతారామయ్య యే క్షణంలోనూ అనుకోలేదు. తనతోకలిసి శ్రుతి కలిపి గొంతు పెద్దదిచేసి ఏడుస్తుందనుకొన్నాడు గాని యిట్లా అసందర్భంగా తనను అనుమానిస్తూ యీ ప్రశ్న అడుగుతుందనుకొంటే యీ గొడవంతా ఆమెముందు చెప్పివుండేవాడు కాడు.

సత్యవతి మళ్ళీ అడిగింది "నిజం చెప్పండీ, నాతో చెప్పరూ?"

"ఎందుకు చెప్పను నీతో! ప్రియసతీ, సత్యవతీ! ఎందుకు అనుమానం నీకు? యిదేకారణం, అవాల్టినుంచి ఒకటే అశాంతి. ఏంచెయ్యను మార్గంయేదైనా చెప్పు. నీకుతోస్తుంది-చెప్పవూ? సత్యవతీ."

సత్యవతికి యేంచెయ్యటానికి తోచదు. ఏడవాలో నవ్వాలో తెలీటంలేదు. భర్తకు మతిపోయిందా? అతని దీనస్థితిచూస్తే తనముందు దాస్తున్నట్టేమీ కనిపించడుమరి. "ఆగండి! అనవసరంగా యేడవకండి చెబుతాను" అంది.

"చెబుతావా? నా సత్యవతీ? నిజంగావా? చెప్పుమరి"అంటున్నాడు సీతారామయ్య. ఒక్కసారిగా భర్త యింత వెర్రివాడయినాడేమిటని సత్యవతికి ఆశ్చర్యం, విచారం మరోకపక్క.

"నిజంగానే చెబుతాను మీరు యేడుపుమాని కూచోండి."

అతిప్రయత్నంమీద సీతారామయ్య పక్కమీద కూర్చోగలిగాడు. "నిజంగా మీరన్న ఆపద వస్తుదంటారా?" సత్యవతి అడిగింది.

"అవును. ఎందుకురాకూడదు? ఎందుకు అసాధ్యం అది?" సీతారామయ్య ప్రశ్నపరంపరలు.

"విచారంలోపడి మీ మతి చలించిపోయింది. పరిస్థితులను మీరు అర్థంచేసుకోలేకపోతున్నారు. ఒకవేళ మీరన్నట్టు (సత్యవతి యేడుస్తూనే యీ మాటలు చెప్పుతోంది. సీతారామయ్య శ్రద్ధగా ఆలకిస్తున్నాడు) ఆ ఆపదేవస్తే మా నాన్నలేడా? ఆయన ఆస్తంతా కరిగిపోయిందనుకున్నారా? ఇగిరిపోయిందనుకున్నారా? ఒరిగిపోయిందనుకున్నారా?—ఎట్లా కలిగింది మీకీఖేదం? మీ మెదడు యెంత మందగించిపోయింది. మీ కళ్ళు యింత సంకుచితంగా యెట్లా మూతలుపడిపోయినాయి? అసలా ఆలోచనలేమిటి? ఎందుకు రావాలి?"

చాలు సీతారామయ్యకు జ్ఞానోదం అయినట్లయింది. నిండు విచారంలో మునిగిపోయినాడే గాని మామగారి ప్రసక్తే గుర్తురాలేదు. ఆయన ధనధాన్య సంపదవుండగా పిల్లలు అడుక్కోవటం యేమిటి? తనకు నిజంగా మతిపోయిందా? దయ్యంపట్టిందా? భూతం ఆవేశించిందా? ఈ దిగులు కలిగించినతర్వాత సత్యవతి పుట్టిల్లే జ్ఞాపకం వచ్చిందికాదేం? చాలు. తన బుద్ధిహీనత సత్యవతి ముందు బయటపడిపోయింది. ఆమె ఇంకా తనని ప్రశ్నిస్తునేవుంది. ఒకొక్క ప్రశ్న శూలమై తన యెదలో నిటారు గాగుచ్చుకొంటూన్నది. "చాలు సత్యవతీ? నాకేదో భూతం ఆవేశించింది. నీవు జ్ఞానోదంచేశావు. నా మైకం వదిలిపోయింది. అనవసరంగా దిగులుపడి నేను కృశించి నిన్ను కృశింపచేసినందుకు క్షమించు. ఇవి చేతులుకాదు. కాళ్లు. క్షమించు సత్యవతీ! అన్నీ మర్చి

పోయాను. నువ్వుకూడా యీ ఘటన్నే మర్చిపోవాలి. ఇది జ్ఞాపకంవుంచుకొంటే మన భావి జీవితానికి తీరని ఆటంకం. మర్చిపో. ఇదిగో నీకు మాటయిస్తున్నాను. ఇకముందు నే నెప్పుడూ దూరపుటాలోచనలుచేసి ఖేదం కొనితెచ్చుకోను. క్షమించవా, సత్యా వతీ?" - సీతారామయ్య ముఖంలో దిగులు పూర్తిగా మాయమయి యేదో వర్ణనాతీతమైన వికాసం ప్రవేశించటం సత్యవతి గమనించింది. ఆ వికాసానికి అర్థంయేమిటో ఆమెకి తెలీకపోయినా భర్త దిగులుమరిచిపోయి మామూలు మనిషయి తిరిగి తనలో లీనమైపోతున్నందుకు మాత్రం ఆమె మనసారా ఆనందించింది. సంతృప్తిచెందింది.

ఇక ఆరాత్రి సీతారామయ్య దంపతులు యెట్లాంటి మధురస్వప్నాలు కన్నారో చెప్ప నవసరం లేదు.

# అంతా మేలుకుంటున్నారు

ఊటుకూరు రంగారావు

మేలుకొన్న మనిషిని చూడాలని
కాలు ముందుకేస్తున్నావా
కలలుగనే మనిషీ! పయనిస్తున్నావా?
కలకాదిది, నిజం, నిజం.
చూడు,
నీ చుట్టూ లేనిద్దుర తెఱ బద్దలైంది.
నీ నగరంలోనే అర్థరాత్రి హాతమైంది.
నాడెవడో మేల్కొన్నాడని
ఎడకో పోవడ మెందుకు?
నీ నీడల్లోనే కదలిక,
నీ వాడల్లోనే జాగృతి.
చూడు!
ఎవడో ఘనవైద్యుడొకడు
ఈ భయంకర నిద్రావ్యాధికి
ఈ విషప్పురుగుల బాధలకీ
అంతం కనుక్కున్నాడని,
నీవూహించింది నిజం, పచ్చినిజం.
కలలో నిజం కాదుమనిషీ!
ఇలలో జరిగిందిది.

ఆ ధూమ శిఖావలయంలో గల
ఆ నల్లని మబ్బు తెఱలు చీల్చుక
శరవేగంతో పరుగిడివచ్చే
చండప్రచండ కిరణాలున్నాయే,
అవే ఆ వైద్యుడు వాడిన
అమూల్యమైన శస్త్రాలు
జరిగింది మహా శస్త్రచికిత్స.
పరవాలేదంతా మేల్కొంటారు.
జడం, చలం, సర్వస్వం
మడమమీద లేస్తున్నవి.
అడవులన్నీ తిరిగి,
ఆ మనిషినే వెతక్క,
రాబోయే నవజాగృతికీ
రాజ్యంలోనే నిలబడి,
నవీనస్వాగతం రచించు.
పలాశ సుమాలని ధరించివచ్చే
ప్రచ్ఛన్నజాగృతి నారాధించు.
ఇక్కడేవుండు మనిషీ!
ఎక్కడకో పోవడ మెందుకు?